# ఈ వారం కథ

కుసుమారెడ్డి

●● "భర్త చనిపోయిన స్త్రీ జీవితాంతం మోడులా వుండిపోవాలని శాసించడం సతీ సహగమనం కంటే ఘోరమైన నేరం. సతి ఒక నాటి చావు అయితే, ఇది నిత్యం చస్తూ బ్రతకడం"

# కొత్త చిగురు




తొమ్మిది నెలలు చీకటి లాంటి తల్లి కడుపులో దాక్కొని భూమి మీదకి రావాలనే తపనతో తల్లి గర్భం చీల్చుకొని వచ్చిన పసికందులా, తూర్పు కొండ మీద ఉదయ భానుడు ప్రభ విస్తున్న వేళ...

కిటికీ దగ్గరగా పడుకొన్న కుంకుమ ఒంటికి సురి వెచ్చగా సూర్యరశ్మి తగలడంతో కంగారుగా లేచి బయటకు చూసింది.

'అబ్బా! ఆకాశం ఎంత అందంగా వుందో! నీలిరంగు చీర మీద వెండి పువ్వులు అద్దినట్టు ఎంత మనోహరంగా వుందో!

తనకి చిన్నప్పటి నుండి ఇలాంటి సుందరమైన దృశ్యాలు చూడడమంటే ఎంత ఇష్టమో!

అసలు ఏది అంటే తనకి ఇష్టం లేదు. చక్కగా తలంటు కొని తుమ్మెదరెక్కల్లాంటి జుట్టుని పాయల్లా విడదీస్తూ మరువం ... జాజులు కలగలిపిన దండ తలలో తురుముకోవా లని... కెంజాయ రంగు మీద ఆకుపచ్చ బుటా ఉన్న చీర కట్టుకొని వనకన్యలా పూల తోట చుట్టూ తిరగాలని ఎన్నిసార్లు తన మనసు ఉవ్విళ్ళూరిందో!

మరి ఒక్కసారి అయినా ఆ కోరిక తీరిందా! తీరలేదు. ఎందుకని! తను నష్ట జాతకురాలు. పెళ్ళయిన ఏడాదికే భర్తను పోగొట్టుకున్న దురదృష్టవంతురాలు.

అసలు చిన్నప్పటి నుండి తన జీవితంలో అన్నీ చేదు గుర్తులే. తను పుట్టగానే తండ్రి పోవడం... ఆ తరువాత కనీసం టెన్త్ అయినా చదివి అమ్మని ఒప్పించి కాలేజీలో చదవాలని, అందమైన సీతాకోక చిలుక లాంటి జీవితం అనుభవించాలని ఎన్ని కలలు కంది? ఎన్ని ఆశలు తన మెడలో పూల హారంలా అలంకరించుకొంది?

కాని అమ్మ తన మాట వింటేనా? "తండ్రి లేని పిల్లవు. సంబంధం మొగిసి వస్తుంది. నువ్వు చదివి ఉద్యోగం చేసి నన్ను పోషించనక్కర్లేదు.

అబ్బాయి అన్ని విధాల బావున్నాడు. ఆస్తి వుంది. చదువు పెద్దగా లేదనుకో! అయినా చిన్నక్క కాపురమే చూడు. ఉద్యోగస్థుడనే ఇచ్చాం. ఏనాడైనా ఆనందంగా వుందా!" అంటూ నచ్చచెప్పి పదహారు రాకుండానే ఓ ఇంటికి ఇల్లాల్ని చేసింది. కాని ఆ ఆనందం ఎన్నాళ్ళు నిలిచింది! కేవలం సంవత్సరం! తన వైవాహిక జీవితం మూడు పువ్వులు ఆరు కాయలుగా వికసిస్తుందని ఎంత ఆశించింది. కాని ఒరిగిందేమిటి? పచ్చగా పది కాలాల పాటు పువ్వు పిందెలతో వుండవలసిన తన జీవితం మోడులా మిగిలి పోయింది. తన కళ్ళు తెరిచేటప్పటికే తండ్రి భూమ్మీద లేదు. తను పుట్టిన కొద్ది గంటల్లో తన తండ్రి ఏక్సిడెంట్‌లో పోవడంతో 'పుట్టగానే తండ్రిని మింగేసింద'నే నిందలతోనే పుట్టింది. పెరిగింది.

సరిగ్గా రెండేళ్ళ క్రితం భర్తతో కోటి కోర్కెలతో మొదటి దీపావళికి వచ్చింది. కాని ఇప్పుడో కొండంత దుఃఖాన్ని మిగిల్చుకొని వచ్చింది. భర్త చదువుకొన్నవాడు కాదు కాని మంచి సంస్కారవంతుడు. పెద్ద అందగాడు కాకపోయినా నిండు మనసుతో ఆదరించగల వ్యక్తిత్వం వున్నవాడు. కలసి వున్నది అనురాగాన్ని పంచుకొన్నది ఏడాదే అయినా కొన్నియుగాలు కలసి జీవించినంత తృప్తే కలిగింది. కాని విధి కాల సర్పంలా కాటు వేసింది.

అక్కలిద్దరూ పెళ్ళిళ్ళయి వాళ్ళ కాపురాలు వాళ్ళు చేసుకుంటుంటే తన జీవితం నట్టేట్లో మునిగిన నావలా అయి పోయింది.

పెద్దక్క ఆమని ... చిన్నక్క పావని కవల పిల్లలు. తండ్రి స్పర్శ ఎలా వుంటుందో... ఆ అనురాగం ... ఆప్యాయత అంతా చవి చూసి తాము కలసి ఎన్ని ఆటలు ఆడుకొనే వారో వాటిని చూసి తండ్రి ఎలా స్పందించేవాడో చెబుతుంటే తనకా యోగం లేనందుకు కుమిలి పోయేది.

"పిన్నీ! పిన్నీ పండుగ పూట అలా కూర్చున్నావేమిటి! అవతల వంటింట్లో చూడు. గిరీశం పెద నాన్నగారు పెసరట్టు మీద పెసరట్టు ఎలా తినేస్తున్నారో! రా! పిన్నీ! చూద్దువుగాని"

అంటూ చిట్టి చిట్టి చేతులతో కుంకుమ కలువ కాడల్లాంటి చేతులను పట్టుకొని వంటింటి వైపు తీసుకు వెళ్ళాడు ఆమని కొడుకు శ్రీకాంత్.

"రావే కుంకుమా! రా! అలా చిక్కి పోయావేమిటే"

"చిన్నక్క ఏదక్కా!" కుంకుమ మాటలకి చిన్నగా నిట్టూర్చింది ఆమని.

"ఏమి చెప్పమంటావే కుంకుమా దాని రాత అలా కాలింది. వాళ్ళాయనకి ఎంత పెట్టినా తృప్తి లేదు. దాని పెళ్ళి అయి అయిదేళ్ళు కావస్తుందా! మీ ఆయన చనిపోయిన ఏడు పండుగ చేసుకో లేదు కదా మనం. అందుకని అది ... ఇది కలిపి వి.సి.పి. కొనివ్వాలట. లేకపోతే దాన్ని కాపురానికి తీసుకెళ్ళడట. వచ్చిన దగ్గర్నుండి అలిగి అతను గది దాటి బయటకు రాలేదు. కాపురం సఖ్యత లేక అది ఏడుస్తూంది. అమ్మేమో ఎన్నాళ్ళు పెట్టి మెప్పించగలం. ఎప్పుడు అతనికి భార్య కావలిస్తే అప్పుడు తీసుకు వెళతాడు అంటుంది"

'ప్చ్... విధివశాత్తు భర్త లేక తను ఈ విధంగా అమ్మకి గుది బండలా మిగిలింది. భర్త వుండి కూడా పావనక్క అమ్మకి బరువు అవ బోతుందా'

కుంకుమ ఆమని కుటుంబంలోని సాధక బాధకాలు చర్చించుకుంటూ కబుర్లలో పడ్డారు.

** ** **


## మీ కోసం




క్రాను దిద్దవచ్చు మరి వంక లేకుండ
దిద్దవచ్చు రాయి తిన్నగాను
మనసు దిద్దరాదు మహిమీద నెవరికి !
విశ్వదాభి రామ వినుర వేమ!

మీ ఆహ్లాదం కొరకు ఈ శీర్షికను సమర్పిస్తున్నవారు:

- ఫిక్సడ్ డిపాజిట్లు పద్ధతి
- అద్దె కొనుగోలు పద్ధతి
- లీజు పద్ధతి

**నాగార్జున ఫైనాన్స్ లిమిటెడ్**

నాగార్జున హిల్స్, హైదరాబాద్-500 482. ఫోన్: 228654, 37389, 228157.

Imageads - 91

ఆ సాయంత్రం ఆమని ... పావని ఇంటి ముందు దీపాలు పెట్టి లక్ష్మీవ్రతం చేసుకున్నాక పిల్లలను దగ్గర కూర్చో పెట్టుకొని మందులు కాల్పిస్తున్నారు.

ఆమని కొడుకు శ్రీకాంత్ ... పావని కూతురు సుప్రియ మందులు కాల్చుకొనేటప్పుడు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు.

కుంకుమ దూరంగా నిలబడి చూసిందే కాని బయటకు వచ్చి వాళ్ళ ఆనందంలో పాలు పంచుకోలేదు.

పావని తల్లిని ఒప్పిస్తానని పండుగ పూట ఇంటిని రభస చెయ్యవద్దని భర్తని బ్రతిమలాడడంతో అతను బయటకు వచ్చి ఆమని భర్తతో కలిసి మాటలు కలిపాడు.

సుభద్ర పగలల్లా అలసి పోయి వరండాలో నడుం వాల్చింది. కాని ఆమె. మస్తిష్కంలో ఆలోచనలు కందిరీగల్లా ముసురుకొన్నాయి. పెద్ద కూతురు ఆమని కాపురం ఫర్వాలేదు. ఎప్పుడైనా అల్లుడు కాస్త పేచీ పెట్టినా వెనుక సమర్థించుకొనే తల్లి తండ్రి వున్నారు.

కాని పావనికి అలా కాదు. వెనుక అత్తా మామ లేరు. వున్నదల్లా కీచకుల్లాంటి అన్నదమ్ములు ఏదో దానికి గిల్లుతునే వుంటారు. ఏదో కోరిక కోరడం... ఆ కోరిక తీర్చక పోతే పిల్లలను పెళ్ళాన్ని పుట్టింట్లోనే వుంచేస్తాడు. పావని ఓపికతో నెట్టుకొస్తూంది. కానీ లేకపోతే ఆ కాపురం నీటి మీద బుడగలాంటిదే.

ఇహ మూడవ కూతురు కుంకుమ విరిసీ విరియని మొగ్గలాంటి వయసులో విధి కాలసర్పంలా కాటు వేసింది.

బి.పి. ఎక్కువ కావడం వల్ల కుంకుమని చూడగానే కోపంతో ఉద్రేకపడింది. అసలే అంతంతమాత్రంగా వున్న పావని కాపురంలో కుంకుమ కావరం నిప్పులు పోస్తుందేమోనని కలతపడింది.

మన బంగారం మంచిదయితే స్వర్ణకారుణ్ణనాల్సిన పనేముందని పావని భర్తను పల్లెత్తుమాట అనలేదు. అల్లుడడిగిన కానుక కొనిచ్చి పంపడమే మంచిదని నిర్ణయించుకొంది. కాని ఆ తర్వాత అసలు సంగతి బయటపడింది. తేలుకుట్టిన దొంగలా పావనిని తీసుకొని అల్లుడు వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు ఆమని వెళ్తూ, వెళ్తూ చెప్పిన నిజం విని వేటగాడి చేత దెబ్బతిన్న లేడి పిల్లలా గిజగిజలాడింది కుంకుమ.

పండుగ మర్నాడు తల్లి అంటున్న సూటిపోటి మాటలు... చురకల్లాంటి చూపులు ఆమెకప్పటికర్థమయ్యాయి. తను ఆ సమయానికి గదిలో లేకపోవడం చూసి... తొందరపడి అపార్థం చేసుకొన్న చిన్నక్క, అమ్మ అంటే అసహ్యమేసింది.

ఇంకా నయం. ఆ తర్వాత బావ మరోసారి పనిపిల్లతో కంటబడి వాళ్ళు ముక్కు మీద వేలేసుకొన్నారట. అలా జరక్కపోతే తన మీద అపవాదు మాయని మచ్చలా వుండిపోయేది.

అంతా వెళ్ళిన తర్వాత ఉక్రోషం పట్టలేక సుభద్రని కడిగేసింది కుంకుమ.

"ఏమ్మా! నెత్తిమీద గొడుగు లేనంత మాత్రాన పరాయి గుడిసెలో దౌర్జన్యంగా దూరి ఆ యింటికి నిప్పంటించే నీచురాల్ని కాదమ్మా! అక్కకి తెలియకపోతే నచ్చచెప్పి... చూసి దోషిని పట్టుకొని అడక్కుండా... చూడకుండా నీడల్ని చూసి అనుమానం పడటం అన్యాయం. మీ దృష్టిలో మగవాడు ఇదే పని చేస్తే న్యాయం... కాని నాలాంటి ఆడది ఎవర్ని చూసినా... మాట్లాడినా తప్పే"

ఆ పిల్ల పొద్దుట నుండి భోజనం చెయ్యలేదు. కళ్ళంట నీరు పెట్టుకొని పడుకొంటే తన గుండెల్లో కత్తులు దింపినట్టయింది. చిక్కుముడుల్లాంటి ఆలోచనలతో ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు కాని సగం రాత్రి మధ్యలో పావని లేపడంతో మెలకువ వచ్చింది సుభద్రకి.

విషయం విన్న సుభద్రకి నవనాడులు పట్టు తప్పాయి. మంచం మీద కుంకుమ లేదు. పావని గదిలో భర్త సతీష్ లేడు. అనుమానంతో తలుపు తీసి పెరట్లోకి వెళ్ళింది.

అరటి చెట్టు నీడలో రెండు ఆకారాలు ఈ ప్రపంచంతో సంబంధం లేనట్టు పెనవేసుకొని వున్నాయి.

అశనిపాతం లాంటి ఆ దృశ్యాన్ని చూసి మొదలు నరికిన చెట్టులా పడిపోయింది సుభద్ర.

తెల్లారేటప్పటికి సుభద్రకి స్పృహ వచ్చింది.

## వాక్య కవిత

## బాడుగ

కాస్సేపు
నా దేహం దేవుడి కద్దెకిస్తాను
అప్పుడు
అడుగడుగునా
పిడికెడు సువాసన
గుండెల మీద గుప్పుమంటుంది.
మరణాన్ని మరణింపచేసే కరుణ
కన్నీటికి భాష్యం చెప్తుంది
మోడైపోయిన చెట్లు
చేతులెత్తి ప్రార్థిస్తున్నప్పుడు
మనిషిలోని పిట్టలు
మంచితనాన్ని వెతుక్కుంటూ ఎగురుతాయి
అందానికి అర్థం అనవసరం.

—ఆరుద్ర

## తింటూ వడ్డిస్తే...

ఆ రోజుల్లో హాస్యబ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావుగారి ప్రసంగం లేకుండా ఏ సభనీ నిర్వహించే వారు కాదు. హాస్యబ్రహ్మ ప్రసంగాన్ని ఆఖరున వుంచేవారు. ముందుగానే ఆయన ప్రసంగం ఏర్పాటుచేస్తే, ఆ తర్వాత కార్యక్రమాలకి ఖాళీ కుర్చీలే మిగులుతాయని నిర్వాహకులకి తెలుసు. ఆ సభలకి వచ్చే రసహృదయులు, ఆ రక్తికట్టని కార్యక్రమాలు చచ్చినట్లు చూస్తూ హాస్యబ్రహ్మ ఉపన్యాసం కోసం ఎదురుచూస్తూ వుండేవారు.

హాస్యబ్రహ్మ చిరునవ్వు అన్నది పెదవి మీదకి రాకుండా హాస్య ప్రసంగం చేసేవారు. ప్రేక్షకులు నవ్వులలో తడిసిపోయి ఆనందంతో ఇంటికి వెళ్ళేవారు.

"ఒకసారయినా నవ్వకుండా అంతటి హాస్య ప్రసంగాన్ని ఎలా చేయగలరండీ" అని సన్నిహితులు అడిగినప్పుడు, "తింటూ వడ్డిస్తే ఏం బావుంటుంది చెప్పండి" అనేవారు హాస్యబ్రహ్మ — నవ్వకుండా!

—'బంటి'

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

# పిచ్చాసుపత్రులలో ప్రధానులు

మతిలేనివాళ్ళూ, మితిమీరిన తెలివితేటలు కలవాళ్ళూ కూడా పిచ్చివాళ్ళుగానే గుర్తింపబడతారని ఒక ఆంగ్ల సామెత. "ఏ పిచ్చీ లేదనుకోవడమే అచ్చమైన పిచ్చి" అన్నది, ఒక ప్రముఖ తెలుగు కవి నుడి.

మనకు స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజుల్లో ప్రధాని జవహర్ ఒకసారి ఒక పిచ్చాసుపత్రిని సందర్శించారు. రోగుల నందర్నీ పరామర్శిస్తూ వెళ్తుండగా ఆయనకు తెల్లని పైజమా, లాల్చీ ధరించిన ఒక వ్యక్తి లోనుండి వస్తూ ఎదురయ్యాడు.

"అయ్యా! మీ రెవరు?" అంటూ ఆ వ్యక్తి నెహ్రూను వినయంగా ప్రశ్నించాడు. "నేను జవహర్‌లాల్ నెహ్రూను" అంటూ జవహర్ తనను తాను పరిచయం చేసుకోబోతూ వుండగా ఆ వ్యక్తి జాలిగా నెహ్రూను చూస్తూ, నెమ్మదిగా వీపు తట్టి "ఫరవా లేదులే. త్వరగానే నయమౌతుంది. ఇక్కడికి చేరిన కొత్తలో నేనూ మహాత్మాగాంధీనని చెప్పుకొనేవాణ్ణి" అంటూ ధైర్యం చెప్పి నిష్క్రమించాడట. ఆ వ్యక్తి తననెలా భావించిందీ ఒక నిముషం తర్వాత అర్థమై నెహ్రూ నవ్వును పట్టలేకపోయారట.

ఇలాగే సుప్రసిద్ధ బ్రిటిష్ ప్రధాని లాయడ్ జార్జ్ విషయంలో కూడా ఒక చిత్రమైన సంఘటన జరిగింది. ఆయనొకసారి వ్యక్తిగత వ్యవహారంపైన ఒక చిన్న నగరానికి వెళ్ళాల్సి వచ్చిందట. ప్రధానిగా కాక సామాన్యునిలా ఆ పని చక్కబెట్టుకురావాలన్పించి అలాగే నిరాడంబరంగా బయలుదేరిన ఆయనకు ఏ లాడ్జీలోనూ బస దొరకలేదట. వసతి కోసం తిరిగి తిరిగి వేసారిన ఆయన ఒక మూడంతస్థుల మేడను లాడ్జిగా భావించి, రిసెప్షన్‌లో కెళ్ళి "నేనే ఈ దేశపు ప్రధానిని. దయచేసి నాకీ రాత్రికి బస ఇక్కడ ఇప్పించగలరా?" అన్నాడట. వెంటనే ఆమె లేచి దృఢకాయుడైన ఒక అటెండర్‌ను పిలిచి జార్జిని అతనికి అప్పగిస్తూ, "మీలాంటి వారి కోసమే మేమున్నది. లోనికి వెళ్ళండి" అందట. ఆ గౌరవానికి, చెప్పగానే తనను ఆమె ప్రధానిగా గుర్తించినందుకు పొంగిపోతూ, "నేనే ప్రధానినని ఎట్లా గుర్తించగలిగావు?" అని జార్జి ఆమెను ప్రశ్నించారట. ఆమె ఆయనను జాలిగా చూస్తూ, "ప్రధానినని చెప్పుకుంటూ ఇక్కడికి చేరినవారిలో మీరు నాలుగోవారు" అని బదులిచ్చిందట. అది అక్కడ కొత్తగా వెలిసిన పిచ్చాసుపత్రని ఆయనకు అప్పుడుగానీ అర్థమవలేదు.

—శ్రీమతి గొల్లాపిన్ని (పాణ్యం) వసుంధరాదేవి

లేత చిగుర్లాంటి పెదవులని నొక్కిపెట్టి, జలపాతాల్లా దూసుకు వస్తున్న కన్నీటిని అదుపు చేసుకొంటూ అడిగిన కుంకుమ మాటలు సుభద్ర గుండెల్లో కత్తుల్లా నాటుకొన్నాయి. ఆమె మారు మాట్లాడలేకపోయింది.

* * *

కుంకుమకి రోజులు బరువుగా... నిర్లిప్తంగా గడుస్తున్నాయి.

తల్లి గుళ్ళో పురాణం చెబుతున్నారని వెళ్ళింది. ఏమీ తోచక తలుపు తాళం పెట్టి, స్నేహితురాలు మదాలస ఇంటికి బయలుదేరింది.

మదాలస తండ్రి బ్యాంకులో మేనేజర్, తల్లి సుభాషిణి కాలేజ్‌లో లెక్చరర్.

మదాలసతో పరిచయం అనుకోకుండా జరిగింది. ఓ రోజు అనుకోకుండా వీధిలో సైకిల్ నేర్చుకుంటూ, రోడ్డు మధ్యలో రాయి తగిలి కింద పడిపోయిది మదాలస.

వీధి అరుగు మీద తల్లితో వత్తులు చేస్తున్న తన కళ్ళలో ఈ దృశ్యం కనబడి గబగబ పరిగెత్తుకెళ్ళి పైకి లేవదీసింది.

ఆ పరిచయాన్ని పురస్కరించుకుని సుభాషిణిని తీసుకొని వాళ్ళు తమ ఇంటికి రావడం... ఒకసారో, రెండుసార్లో తను వెళ్ళడం జరిగాయి.

వాళ్ళింటికి వెళ్ళినప్పుడల్లా తల్లి అయిష్టంగా మాట్లాడేది. వాళ్ళు వచ్చినప్పుడు సరిగ్గా పలకరించేది కాదు. తల్లి మనస్తత్వం వాళ్ళు గమనించినా పట్టించుకోలేదు.

మదాలసకి అన్నయ్య వున్నాడు. అతను బ్యాంకులో ఉద్యోగం. సుభాషిణి దంపతులది కూడా ఆదర్శ వివాహమే. సుభాషిణి ఒక బిడ్డకి తల్లయ్యాక భర్త అనుకోకుండా చనిపోతే, ఆమెను వివాహం చేసుకున్నాడు రాజారావు.

మదాలసని ఎంత అభిమానంగా చూస్తాడో... కొడుకు సంజయ్‌ని కూడా అలాగే చూస్తాడు రాజారావు.

తనని చదువుకోమని... ఎన్నో విధాలుగా నచ్చచెప్పేవారు. కాని తల్లి వింటేనా?

కొడుకుకి కూడా ఆదర్శప్రాయమైన వివాహమే చేస్తానని, అందుకు తను అంగీకరిస్తే, తమ కోడలిగా చేసుకుంటామని చెప్పారు. అన్యమనస్కంగానే మదాలసతో గడిపి కుంకుమ ఇంటికొచ్చేసరికి బాగా పొద్దుపోయింది.

వీధి గదిలో నుండి తల్లి... మావయ్య మాటలు విన్పించడంతో, వింటున్న కుంకుమ కళ్ళల్లో కోటి కాంతులు...

"అవునక్కయ్యా! భర్త చనిపోయిన స్త్రీ జీవితాంతం అలా మోడులా వుండిపోవాలని శాసించడం సతీసహగమనం కంటే ఘోరమైన నేరం. సతి ఒకనాటి చావు అయితే, ఇది నిత్యం చస్తూ బ్రతకడం. ఇలాంటి నరకాన్ని నీ కూతుర్ని అనుభవించమంటూ, ఇంకా అనుమానించి నాలుగ్గోడల మధ్య సంప్రదాయం పేరుతో బంధించడానికి నీ మాతృ హృదయం ఎలా అంగీకరిస్తుంది? ఎంతో కాలం దాంపత్య సుఖాలనుభవించిన మగాళ్ళకు లేని నియమాలు ఓ ఏడాదో, ఆరో సంసారం చేసిన స్త్రీకి విధించడం ఎంత ఘోరం? స్వల్పకాలం భార్య ఎడబాటు తట్టుకోలేని నీ చిన్నల్లుడు పనిమనిషికి చేరువు అయ్యాడే- అలాంటిది కుంకుమ జీవితాంతం వైధవ్యం భరించడమంటే మాటలా... ఆడదానిగా నువ్వు ఆలోచించు"

గిరీశం గొంతు వినిపిస్తోంది.

"అవును తమ్ముడూ, నువ్వు చెప్పింది న్యాయమేననిపిస్తోంది. నీ ఎరుకలో ఎవరైనా మంచి మనిషి వుంటే చూడు..."

ఆ మాటలు విన్న కుంకుమ మనసు మీద వసంతం హసించినట్లయింది.

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్